ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
గురువారం 10 అక్టోబరు 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 24.0

'టెట్'కు 327 మంది హాజరు

ఏలూరు అర్బన్, అక్టోబరు 9 : ఉపాధ్యాయ అర్హతా పరీక్ష (టెట్)లో భాగంగా బుధవారం ఉదయం పరీక్షకు 186 మందికి 167 మంది, మధ్యాహ్నం 186 మందికి 160 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం తెలిపారు.



పోలవరం.. ఇక కళకళ!

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

చాన్నాళ్ళపాటు నిత్యం నోట్లో నానే పోలవరం ప్రాజెక్టు దానికి దూరమైంది. జరగాల్సిన పనులు మాయమయ్యాయి. డయాఫ్రంవాల్ వంటి పనులన్నింటిని నష్టపోయాం. ఒకప్పుడు పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్న వేళ జిల్లాకు వచ్చీపోయే వారితో కళకళలాడేది. బిహార్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు వేలాది మంది ప్రాజెక్టు పనుల్లో శ్రమించేవారు. వారానికోమారు పోలవరం గ్రామానికి వచ్చి సంత చేసుకునేవారు. అదే గ్రామంలో కాస్తంత సేదీ తీరేందుకు తాత్కాలిక నిర్మాణా ల్లోను ఇంకొంతమంది బస చేసేవారు. ఇప్పుడు పోలవరం ప్రాజెక్టుకు మళ్ళీ పూర్వ రూపురేఖలు తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగులు కదిపింది. రాబోయే రెండు, మూడు నెలల్లో పనులు శరవేగంగా సాగేందుకు నాంది పలక బోతున్నారు.

అప్పట్లో అంతా కళకళ

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులన్నీ దాదాపు 2014-19 ఐదేళ్ల కాలంలో శరవేగంగా ముందుకు సాగాయి. అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ చూపి 28 సార్లు పనులు పరిశీలన నిమిత్తం ప్రాజెక్టుకు వచ్చారు. మరికొన్నిసార్లు వర్చువల్ సమావేశాలు నిర్వహించి ప్రాజెక్టు పురోగతిని సమీక్షించేవారు. స్పిల్‌వే, మరోవైపు డయాఫ్రం వాల్, ఇంకోవైపు ఎగువ, దిగువ కాఫర్ డ్యాం నిర్మాణ పనులన్నీ ఏక కాలంలో జరిగేవి. 1800లకు పైగా యంత్రాలు నిత్యం పని ప్రాంతంలో ఉండేవి. ప్రాజెక్టు సందర్శనకు వచ్చే ఉన్నతాధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టు ఏజన్సీ అధికారులతో అడుగుతీసి అడుగు వేయనంత రద్దీ నిత్యం కనిపించేది. కాంక్రీట్ పనులకు అనువుగా సిమెంటు లోడ్‌లు వందల్లో కదిలేవి. పోలవరం నిర్మాణం ఎలా సాగుతుందో ప్రత్యక్షంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రైతులను, ప్రజలను ప్రాజెక్టు స్థలికి ప్రభుత్వం అనుమతించడమే కాకుండా వారి రాకపోకలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించింది. అప్పట్లో పోలవరం గ్రామం సైతం కళకళలాడేది. ఆఖరుకి చిరు వ్యాపారులు సైతం సంతృప్తికర ఆదాయాన్ని పొందేవారు. ఇక అమ్మకాలు, కొనుగోళ్ళు భారీగాసాగేవి. దీనికంతటికి కారణం ప్రాజెక్టు పనులు చురుగ్గా, శరవేగంగా కొనసాగడమే. అప్పట్లో పోలవరం గ్రామంలో ఎవరైనా అద్దెకు ఇస్తే అదే మహాభాగ్యం. మూడున్నర వేల నుంచి ఏడు వేల వరకు అద్దె పెరిగింది. ఇంకోవైపు ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించడం, వారంతా పోలవరం చేరువగానే ఉండడంతో పోలవరం కిక్కిరిసినట్టు కనిపించేది. ఇదంతా ఐదేళ్ళ క్రితం మాట. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం తీసుకున్న చొరవ అన్నింటికీ యోగ్యమైంది. ఆఖరుకి పోలవరం పరిసర ప్రాంతాల్లోను పెద్ద ఎత్తున నిఘా బృందాల పహారా ఉండేది. డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పోలీసు ఉన్నతాధికారులు సైతం ప్రాజెక్టు స్థలిని పర్యవేక్షించేవారు.

మళ్లీ ఆ రోజులొచ్చేశాయ్..

- రాబోయే రెండు నెలల్లోనే మళ్లీ పోలవరం ప్రాజెక్టు పనులకు శ్రీకారం
- ఆ దిశగానే కేంద్ర, రాష్ట్రాలు ముందడుగు
- సీఎం చంద్రబాబు చొరవతో పనులకు మోక్షం
- ఒకప్పటి పూర్వ వైభోగం మళ్లీ పునరావృతం

జగన్ హయాంలో.. అంతా స్టాప్‌స్టాప్

2019-2024 మధ్య అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టులో అనేక పనులు చేశామని పైపైకి ప్రచారం చేసుకునేది. కాని లోతట్టున జరగాల్సిన పనులన్నీ నిలిచిపోయిన, ప్రతిష్టంభనకు గురైనా నామమాత్రపు సమీక్ష కూడా ప్రాజెక్టు నోచుకునేదికాదు. వైసీపీ జమానాలో జల వనరుల శాఖ మంత్రులు పదేపదే మారడమే రాజకీయ పురోగతి కనిపించింది. కాని ప్రాజెక్టు పురోగతిలో ఎలాంటి అనూహ్య విజయాలను సాధించకపోగా ఉన్న పనులు మందగించాయి. డయాఫ్రంవాల్‌కు నష్టం జరిగినట్టు సంకేతాలు వెలువడిన తర్వాత కేంద్ర జల నిపుణుల సంఘంతో రాష్ట్రం పరిష్కార మార్గాలను అన్వేషించాలని కోరినా ఆ మేరకు కేంద్రంపై ఒత్తిడి తేవడంలో విఫలమైంది. నిధుల విషయంలోను చతికిలబడింది. రివర్స్ టెండరింగ్ విధానం అనూహ్యంగా గడిచిన ఐదేళ్ళల్లో రివర్స్ అయ్యింది. ఎగువ కాఫర్ డ్యాం పూర్తయినా, దిగువ కాఫర్ డ్యాం అంతంత మాత్రంగానే సాగింది. జల విద్యుత్ కేంద్రం పనులు సాగినట్టే సాగి నిలిచిపోయాయి. స్పిల్‌వే కొలిక్కివచ్చినా అదంతా ఒకప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సాధించిన విజయంగానే చెప్పవచ్చు. ఆర్‌అండ్‌ఆర్ పనుల్లోనూ అంతా ప్రచార ఆర్భాటమే. ప్రాజెక్టు నిర్మాణ స్థలిలో వైసీపీ హయాంలో కేవలం పదుల సంఖ్యలోనే కార్మికులు కనిపించేవారు. ఆఖరుకి పోలవరం కుడి కాల్వకు అనుసంధానం చేసే జంట గుహల పైభాగం కుప్పకూలినా ఆ తర్వాత దాని సంగతి పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికీ ఆ పనులన్నీ అలాగే గాలికొదిలేశారు.

కూటమి ప్రభుత్వం రాకతో కొత్త కళ

పోలవరం ప్రాజెక్టు శరవేగంగా పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం గడిచిన మూడు నెలల్లో కేంద్రంతో చేసిన సంప్రదింపులు కొలిక్కి వచ్చాయి. భారీగా నిధులు రాబట్టడానికి వీలుగా సీఎం చంద్రబాబు ప్రధాన మంత్రి దగ్గర నుంచి మిగతా కేంద్ర మంత్రులతో దఫాల వారీగా చర్చించి నిధులు మంజూరుతో పాటు విడుదలకు ప్రయత్నిస్తున్నారు. ఈ కారణంగా రాబోయే రెండు నెలల్లోనే పోలవరంలో మిగిలిన పనులు శరవేగంగా ముందుకు సాగేందుకు అనువైన కార్యాచరణ సిద్ధమవుతోంది. ఇప్పటివరకు నిశ్శబ్దంగా ఉన్న పోలవరంలో తిరిగి 2014 తరహాలో యంత్రాలతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పని ప్రాంతానికి చేరుకోనున్నారు. నిత్య పర్యవేక్షణ, ఇంకోవైపు కేంద్రం పరిశీలన ఉండబోతుంది. ఈ నేపథ్యంలో పూర్వపు కళ ప్రాజెక్టు సంతరించుకోబోతుండడంతో రైతులతో పాటు స్థానికులు సంబరపడుతున్నారు. నిత్యం పోలవరం ప్రాజెక్టు పురోగతిని, సీఎం చంద్రబాబుతో పాటు మిగతా కూటమి నేతలు చేస్తున్న కృషిని సైతం చర్చించుకోవడం ఆరంభించారు. గడిచిన ఐదేళ్ళ పాటు పనులన్నీ జరిగి ప్రాజెక్టు పూర్తయ్యి ఉంటే లక్ష లాది ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరుకు ఢోకా ఉండేదేకాదని, జగన్ ప్రభుత్వంలో చేసిన అరాచకాలకు తావుండేదే కాదన్న అభిప్రాయం అందరిలోను వినిపిస్తోంది.

సదరం..నరకం!

సర్టిఫికెట్ల కోసం దివ్యాంగుల అష్టకష్టాలు

ఏలూరు క్రైం, అక్టోబరు 9 : దివ్యాంగులకు బాసటగా ఉండేందుకు, వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దివ్యాంగుల పెన్షన్ పొందాలంటే సదరం సర్టిఫికెట్‌ను ప్రభుత్వ ఆస్పత్రిలోని మెడికల్ బోర్డు ద్వారా పొందాలి. జిల్లాలో జంగారెడ్డిగూడెం, నూజివీడు, భీమడోలు, దెందులూరు, పోలవరం, కైకలూరు, బుట్టాయిగూడెం ఆస్పత్రులు వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఉండగా, కొన్ని విభాగాలకు ఈ ఆస్పతుల్లో సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తారు. ఇంకా అన్ని విభాగాలకు ఏలూరులోని సర్వజన ఆస్పత్రిలో జారీ చేస్తారు. జిల్లాలో ఉన్న దివ్యాంగులు అందరూ ఇంచుమించు ఏలూరు ప్రభుత్వాస్పత్రి నుంచే సదరం సర్టిఫికెట్లను పొందుతూ ఉంటారు. గతంలో వైద్య విధాన పరిషత్ విభాగంలో ఆస్పత్రి ఉండగా ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఎంఆర్ఐ స్కాన్ సెంటర్ సమీపంలో దాతలచే 15 లక్షల వ్యయంతో నిర్మించబడిన పెద్ద హాలు (షెడ్డు)లో సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ నిర్వహించే వారు. అక్కడ విభాగాల వారీగా బెంచీలు వేసి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మళ్లీ మధ్యాహ్నం నుంచి 2 గంటల నుంచి నాలుగు గంటల వరకు సంబంధిత విభాగపు వైద్యనిపుణులు దివ్యాంగులను పరిశీలించి వ్యాధి నిర్ధారణ ధ్రువపత్రాలను పరిశీలించి సదరం సర్టిఫికెట్లను జారీ చేసేవారు. అన్ని విభాగా లకు అక్కడే ఇచ్చేవారు. ఎవరైనా లేవలేనివారు, కదలలేని వారు కారుల్లోనూ, అంబులెన్సు ల్లోనూ వస్తే వాహనాల వద్దకే వైద్యులు వెళ్ళి రోగులను పరిశీలించి ధ్రువీకరణ చేసుకునేవారు. మెడికల్ కాలేజీగా మార్పు చెందిన తర్వాత సదరం సర్టిఫికెట్ల ప్రక్రియ ఏరోజు ఎవరు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. కొద్ది రోజుల పాటు ఓపీ విభాగాల్లో ఉన్న వైద్యులు సంబంధిత వ్యాధి నిర్ధారణను బట్టి పరిశీలించి ఇచ్చేవారు. అయితే నెల రోజుల నుంచి సదరం సర్టిఫికెట్లు పొందేవారు, డాక్టర్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అప్లికేషన్లపై మెడికల్ బోర్డు సంతకాలు పొందాలనుకునే వారు నరకయాతన అనుభవిస్తున్నారు. ఎన్టీఆర్ భరోసాపై సంతకాలు పొందేవారు మంగళవారం, గురువారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మాత్రమే జారీ చేస్తా మని నోటీసు బోర్డులు పెట్టారు. అన్ని విభాగా లకు సంబంధించి దివ్యాంగులందరూ 25వ నెంబర్ ఓపీ వద్ద ఉండా లని అక్కడికే వైద్యులు వస్తారని సూచించడంతో అక్కడ ఎలాంటి సౌకర్యాలు రోగులకు లేకపోవడంతో నేలపైనే తమ దివ్యాంగ పిల్లలను పడుకోబెట్టుకుని వైద్యుల కోసం పడిగాపులు పడాల్సి వస్తోంది. తాగ డానికి మంచినీరు లేని పరిస్థితి. వందలాది మంది దివ్యాంగులు వారి సహాయ కారులు వస్తుండడంతో గాలి పీల్చుకోవడానికి కనీసం ఫ్యాను సౌకర్యం ఆ ప్రాంతంలో లేదు. 25వ నెంబర్ వరకూ రోగు లను తీసుకెళ్లాలంటే ఎంతో నరకయాతన పడాల్సి వస్తోం ది. వీల్ ఛైర్స్ అంతంత మాత్రంగానే ఇస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ సంతకాలు పెడతామని మెడికల్ సూపరింటెండెంట్ పేరుమీద నోటీసు బోర్డు ఉన్నప్పటికీ ఆ సమయంలో సర్టిఫికెట్ జారీ చేసే రూముకు ఒక్క వైద్యుడూ రావడం లేదని దివ్యాంగులు వాపోతున్నారు. ఈ మంగళవారం కూడా ఇదేవిధంగా పడిగాపులు పడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని గతంలో సదరం సర్టిఫికెట్లు జారీ చేసిన విశాలమైన ప్రదేశంలోనే దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరుతున్నారు.



మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం సర్టిఫికెట్ కోసం వేచివున్న దివ్యాంగులు







నూతన కోఆప్షన్ సభ్యులను అభినందిస్తున్న మేయర్ నూర్జహాన్

కోఆప్షన్ సభ్యుల ఎన్నిక

ఏలూరు రూరల్, అక్టోబరు 9 : ఏలూరు మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక బుధవారం జరిగింది. కౌన్సిల్ సమావేశ భవనంలో చైర్‌పర్సన్ షేక్ నూర్జహాన్ పెదబాబు అధ్యక్షతన ఈ మేరకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏలూరు నగర పాలక సంస్థలో వైసీపీకి చెందిన ముగ్గురు కోఆప్షన్ సభ్యులు తమ వ్యక్తిగత కారణాల వల్ల పదవులకు రాజీనామా చేశారు. ఆ స్థానంలో ముగ్గురు అభ్యర్థులను టీడీపీ ఎంపిక చేసింది. సమావేశంలో చోడే వెంకటరత్నం పేరును 37వ డివిజన్ కార్పొరేటర్ సోము పృథ్వీ శారద ప్రతిపాదించగా రెండో డివిజన్ కార్పొరేటర్ జి.కనక నరసింహారావు బలపరిచారు. జాలా సుమతి పేరును 47వ డివిజన్ కార్పొరేటర్ వందనాల దుర్గాభవాని ప్రతిపాదించగా 49వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాసరావు బలపరిచారు. కొల్లేపల్లి రాజు పేరును 28వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల అరుణ ప్రతిపాదించగా 8వ డివిజన్ కార్పొరేటర్ వి.ప్రవీణ్ బలపరిచారు. ముగ్గురు కోఆప్షన్ సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేశారు. మేయర్ నూర్జహాన్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, పలువురు టీడీపీ నాయకులు, కార్పొరేషన్ అధికారులు వారిని అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి, సంక్షేమ పథకాల అమల్లో కౌన్సిల్ సభ్యులు తమ వంతు కృషి చేయాలన్నారు.

మద్యం దరఖాస్తులకు మరో రెండు రోజులు గడువు

ఇప్పటి వరకు 3,854 దరఖాస్తులు.. రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం

ఏలూరు క్రైం, అక్టోబరు 9 : జిల్లాలో ఏర్పాటు చేయబోయే 144 మద్యం షాపులకు బుధవారం రాత్రి 9 గంటల వరకు 3,854 దరఖాస్తులు ఇప్పటి వరకు వచ్చాయి. ముందు ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలతో ముగియనున్న దరఖాస్తులు చేసే గడువును ఈనెల 11వ తేదీ రాత్రి 7 గంటల వరకు పొడిగించారు. 11న జరగాల్సిన లాటరీ ప్రక్రియను 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి లాటరీ తీయనున్నారు. డ్రాలో దుకాణ లైసెన్స్ పొందిన వారు వెంటనే బ్యాంకుల్లో డీడీలు తీసి షాపులు ఏర్పాటు చేయడానికి బ్యాంకు సెలవులు అడ్డంకిగా ఉండడం వల్లనే గడువును పెంచారు. ఇప్పటి వరకు జిల్లాలో ఉన్న ఏడు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో దరఖాస్తులు ఇలా ఉన్నాయి. ఏలూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 301, చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 578, భీమడోలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 854, జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 736, పోలవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 473, నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 500, కైకలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 412 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రస్థాయిలో అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లాలో దరఖాస్తులు వచ్చి ప్రథమ స్థానంలో ఉండగా ఏలూరు జిల్లా రెండో స్థానంలో ప్రస్తుతం నిలిచింది. ఈ నెల 11 వరకూ గడువు ఉండడంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 175 షాపులకు ఇప్పటి వరకు 3200 దరఖాస్తులు అందాయి.



సరస్వతీ..నమస్తుభ్యం

దేవీ నవరాత్రుల్లో భాగంగా బుధవారం మూలానక్షత్రం నేపథ్యంలో అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంలో సరస్వతి దేవి అలంకరణలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పల్లె పండుగ వారోత్సవాలకు ప్రణాళిక

ఏలూరు సిటీ, అక్టోబరు 9 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పల్లెపండుగ వారోత్సవాలను సంబంధిత అధికారులు సమన్వయంతో విజయ వంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యా లయంలో బుధవారం ఈనెల 14 వతేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో చేపట్టిన పల్లె పండుగ వారోత్సవాలకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'గ్రామీణ కుటుం బాలకు నివాసం ఉంటున్న గ్రామాల్లో ఏడాదిలో కనీసం 100 రోజులు వేతన ఉపాధి కల్పించాలి. ఆగస్టు 23న ఏలూరు జిల్లాలో ఒకే రోజున నిర్వహించిన గ్రామ సభల్లో తీర్మానించిన పనులన్నింటినీ పూర్తి చేయాలి. గ్రామాల్లో మరింత పారదర్శకత, ప్రజల్లో జవాబుదారీతనం, పెంచేందుకు పనులను అందరూ కలిసి పండుగ వాతావరణంలో భూమి పూజ చేయాలి. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజలకు కనిపించే విధంగా 2024-25 సంవత్సరం చేపట్టబోయే పనులు, పూర్తి చేసిన పనులు వివరాలు తెలిపే సిటిజన్ నాలెడ్జ్ బోర్డులు ఏర్పాటు చేయాలి' అన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో సుబ్బారావు, డీపీవో కె.అనూరాధ, డ్వామా పీడీ వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ ఆడిట్‌లో జిల్లాకు ప్రథమ స్థానం

- పీజీఆర్ఎస్‌లో అందిన వినతుల్లో 98.50 శాతం ఆడిట్ పూర్తి
- ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా యంత్రాంగం చేస్తున్న అవిరళ కృషికి తగిన గుర్తింపు

ఏలూరుసిటీ, అక్టోబరు 9 : రాష్ట్ర స్థాయిలో ప్రతి జిల్లా నుంచి పరిష్కరించిన పీజీఆర్ఎస్ అర్జీల ఆడిట్‌లో (ఫిర్యాదుదారుల సంతృప్తి స్థాయిని తెలుసుకోవడంలో) రాష్ట్రంలో ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలో పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీల్లో 2,939 పరిష్కరించిన వాటిల్లో 2,895 అర్జీలకు సంబంధించి ఫిర్యాదుదారుల సంతృప్తిస్థాయిని తెలుసుకున్నారు. పరిష్కార తీరును క్షేత్రస్థాయిలో ఆడిట్ నిర్వహించి 98.50 శాతంతో ఏలూరు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రజల నుంచి స్వీకరించిన వినతుల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారికి పీజీఆర్ఎస్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా పంపుతారు. సంబంధిత అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి ఫిర్యాదుదారుడిని సంప్రదించి నాణ్యమైన పరిష్కార నిమిత్తం ఫిర్యాదుదారుడి సంతృప్తి అంతిమ ధ్యేయంగా అతని అనుమతితో అర్జీని ముగిస్తారు. పరిష్కరించిన పీజీఆర్ఎస్ అర్జీల నాణ్యత పరిశీలన నిమిత్తం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాలతో జిల్లాలో అత్యధికంగా ఫిర్యాదులు అందుతున్న రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, వ్యవసాయ శాఖ, ఇతర శాఖలకు చెందిన తర్ఫీదు పొందిన ఉద్యోగులను పీజీఆర్ఎస్ ఆడిట్ నిమిత్తం నియమించారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం వారి సూచనలు, మార్గదర్శకాల ప్రకారం ఆడిట్ టీమ్ సంబంధిత శాఖల నుంచి పరిష్కరించిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి ఫిర్యాదుదారుడు సంతృప్తి స్థాయిని తెలుసుకుని సంబంధిత ఫిర్యాదుదారుడిని ఫోన్‌లో సంప్రదించి అర్జీదారు సంతృప్తి స్థాయిని తెలుసుకుంటారు. కలెక్టర్ వెట్రిసెల్వి నేతృత్వంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ ద్వారా అర్జీల పరిష్కారంలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పని చేస్తుందనడానికి ఇది నిదర్శనంగా పేర్కొనవచ్చు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్ నోడల్ అధికారి, ఏలూరు డీఎల్‌డీవో లక్ష్మిని, సంబంధిత సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.



వెంకటేశ్వరరావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గంగమ్మ తల్లీ ఎంత పనిచేశావమ్మా

- కోడి పుంజును ఈత కొట్టిస్తూ.. ఇద్దరు కుమారుల మృతి
- కాపాడే క్రమంలో తండ్రి మృత్యువాత.. శోక సంద్రంలో తల్లి




పోలవరం కాల్వలో గాలింపు చర్యలు చేపట్టిన అగ్నిమాపక సిబ్బంది




మృతులు వెంకటేశ్వరరావు, మణికంఠ, సాయికుమార్ (ఫైల్)

పెదవేగి, అక్టోబరు 9: 'భర్తను పొట్టన పెట్టుకున్నావు. ఇద్దరు పిల్లలను లాగేసుకుని ఒంటరిని చేశావు. నన్ను కూడా తీసుకుపో గంగమ్మ తల్లీ' అంటూ రోదిస్తున్న ఆమెను ఓదార్చడం ఎవరితరం కాలేదు. భర్త, బిడ్డల మృతదేహాలను పట్టుకుని ఏకధాటిగా విలపిస్తూనే వుంది. ఆమె రోదన చూసి అందరి హృదయాలు ద్రవించాయి. ఆ మహాతల్లికి ఎంత కష్టమొచ్చిందో పాపం అంటూ అక్కడ వున్న ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించాయి. ఏలూరు జిల్లా పెదవేగి మండలం కవ్వగుంట తోటల్లో శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, భార్య దేవి, కుమారులు మణికంఠ (15), సాయికుమార్ (12)లతో కలిసి ఉంటున్నారు. తనకు 85 సెంట్ల భూమి ఉండగా 35 సెంట్ల భూమి పోలవరం కాల్వలో పోయింది. మిగిలిన అరెకరం భూమిలో ఇంటిని నిర్మించుకుని, పశుపోషణతో పాటు ఎడ్లబండి కిరాయికి తిప్పుకుంటూ జీవిస్తున్నాడు. కుమారులను ఇద్దరిని ప్రయోజకులను చేసేందుకు తనకు భారమైనా పెదవేగిలోని ఓ ప్రైవేటు స్కూలులో చదివిస్తున్నాడు. మణికంఠ తొమ్మిది, సాయికుమార్ ఏడో తరగతి చదువుతున్నారు. వెంకటేశ్వరరావు పాడితో పాటు కోడి పుంజులను పెంచుతూ సంక్రాంతి సమయంలో విక్రయిస్తుంటాడు. వచ్చే సంక్రాంతి పందేల నాటికి కోడి పుంజులను సిద్ధం చేసేందుకు వాటిని పోలవరం కాల్వలో రోజూ ఈత కొట్టిస్తున్నాడు. బుధవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో కుమారులు ఇద్దరూ కోడి పుంజును ఈత కొట్టించడానికి కాల్వ దగ్గరకు వెళ్లారు. తమ్ముడు సాయికుమార్ ఒడ్డున తాడు పట్టుకుని ఉండగా, అన్న మణికంఠ ఒక చేత్తో కోడి పుంజును, మరో చేత్తో తాడును పట్టుకుని 15 అడుగుల దిగువన ఉన్న కాల్వలోకి దిగాడు. పుంజును ఈత కొట్టిస్తూ ప్రమాదవశాత్తు మణికంఠ కాల్వలో పడిపోయాడు. అతన్ని రక్షించే క్రమంలో సాయికుమార్ నీటిలో పడిపోయాడు. సమీపంలో వున్న తండ్రి వెంకటేశ్వరరావు వీరిని కాపాడడానికి కాల్వలోకి దిగగా ముగ్గురూ నీట మునిగిపోయారు. ఇంతలో తల్లి దేవి కాల్వ గట్టు వద్దకు వచ్చి చూడగా ముగ్గురు కాల్వలో మునిగిపోయినట్టు గుర్తించి కేకలు వేయగా సమీప రైతులు వచ్చి కాపాడే ప్రయత్నం చేశారు. వెంకటేశ్వరరావు, మణికంఠ మృతదేహాలు లభించాయి. ఏలూరు అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని కాల్వలో గాలించి సాయికుమార్ మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ప్రమాదంలో కోడి పుంజు కూడా చనిపోయింది. పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్‌లో ఘటనా స్థలానికి చేరుకుని, శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బైక్‌పై పొలం వెళ్తూ.. కాల్వలో జారిపడి మృతి





ఘటనా స్థలం (ఇన్‌సెట్‌లో) రామకృష్ణ (ఫైల్)

చాట్రాయి, అక్టోబరు 9: మండలంలో బూరుగ్గూడెంలో బుధవారం ఓ యువ కుడు బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తూ కాల్వలో జారిపడి దుర్మరణం పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన రైతు మునగాల సత్యనారాయణ, పద్మ దంపతులకు కుమారుడు రామకృష్ణ (28), కుమార్తె సంతానం. తమ సొంత భూమిలో తండ్రితో పాటు వ్యవసాయం చేస్తూ రామకృష్ణ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. ఐదు నెలల కిందట ఇతనికి వివాహమైంది. గ్రామంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం కాల్వ అసంపూర్తిగా తవ్వి వదిలేశారు. ఇది పెద్ద కాల్వ కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నిండుగా నీరు ఉంది. ఆ కాల్వ కట్ట పైనుంచే నిత్యం రామకృష్ణ పొలానికి వెళ్లి వస్తుంటాడు. రోజూ మాదిరిగానే బుధవారం కట్టపై వెళుతుండగా బైక్ అదుపు తప్పడంతో అతను కాల్వలోకి పడిపోగా బైక్ కట్ట చివరు జారి నిలిచిపోయింది. రామకృష్ణకు ఈత రాకపోవడంతో నీట మునిగి పోయాడు. కొద్దిసేపటికి ఆ దారిన వెళుతున్న రైతులు బైక్‌ను చూసి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మరోవైపు సమాచారం అందుకున్న ఎస్ఐ డి.రామకృష్ణ పర్యవేక్షణలో స్థానిక ఈతగాళ్ళు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న తమ కొడుకు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి శవ పంచనామా జరిపి పోస్టుమార్టంకు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.



ముగిసిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలు

పాలకొల్లు అర్బన్, /పాలకొల్లు రూరల్, అక్టోబరు 9: కాస్మో స్పోర్ట్స్ కల్చరల్ కాంప్లెక్స్, ఎంసీవీఎస్ఎం టౌన్ హాలు ఆధ్వర్యంలో రెండురోజులు నిర్వహించిన బాల,బాలికల రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు రుద్రరాజు పద్మరాజు మెమోరియల్ టోర్నీ పేరుతో ఈ పోటీలు నిర్వహించారు. అండర్ 14 విభాగంలో లక్షిత్ చౌదరి, విహార్, అండర్ 10 విభాగంలో దాక్షిత్, అమన్, బాలికల సింగిల్స్ అండర్ 12 విభాగంలో భువన్ ధీరజ్, వీరేన్, అండర్ 14 విభాగంలో దుర్గశ్రీ అఖిల్, రన్నర్‌గా కుషీద్ , బాలికల అండర్ 10 విభాగం సింగిల్స్‌లో ఆత్రేయ, శృతిశ్రీ, అండర్ 12 సింగిల్స్‌లో లేఖ్యశ్రీ, ఆత్రేయ పెరమ్‌లు విజేతలుగా నిలిచారు.



భీమవరంలో సత్య షోరూం ప్రారంభం

భీమవరం, అక్టోబరు 9: భీమవరం జువ్వలపాలెం రోడ్డులో సత్య ఏజెన్సీస్ 37వ షోరూం ఏర్పాటైంది. బుధవారం భవన యజమాని అన్నపూర్ణ, ఆమె కుటుంబీకులు రిబ్బన్ కట్ చేసి షోరూంను లాంఛనంగా ప్రారంభించారు. సత్య ఏజెన్సీస్ మేనేజింగ్ డైరెక్టర్ జాన్సన్, ఏపీ హెడ్ సెంథిల్, వివిధ బ్రాండ్లకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు.సెంథిల్ మాట్లాడుతూ అన్ని సంస్థలకు చెందిన ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ అందుబాటులో ఉంటాయని భీమవరం, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీవారి సేవలో దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల



ద్వారకాతిరుమల, అక్టోబరు 9: చిన వెంకన్న ఆలయాన్ని సినీ దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల బుధవారం కుటుంబ సభ్యులతో కలసి ఆల యానికి విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం పండితుల నుంచి వేదా శీర్వచనం, ప్రసాదాలను పొందారు. కొందరు భక్తులు ఆయనతో కలసి సెల్ఫీలు దిగారు.

22,23 తేదీల్లో స్కేటింగ్ పోటీలు

ఏలూరు రూరల్, అక్టోబరు 9: రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీల్లో ఏలూరు ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులను కాకినాడలో నవంబరులో జరిగే 36వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోలర్స్ స్కేటింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. క్రీడాకారులు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులు అందచేయాలని తెలిపారు. మరింత సమాచారానికి 98481 88097 నంబరులో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు నీతి అయోగ్ బృందం పర్యటన

ఏలూరు రూరల్, అక్టోబరు 9: నీతి ఆయోగ్ బృందం గురువారం జిల్లాలో పర్యటించనుంది. ఉదయం 11.30 గంటలకు ఏలూరు రూరల్ మండలం వెంకటాపురంలో పర్యటిస్తారు. రైతులతో మాట్లాడతారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల మధ్య స్వయం సహాయక బృందాలతో మాట్లాడి, అక్కడి నుంచి వట్లూరులోని టీటీడీసీకి చేరుకుంటారు. అనంతరం జిల్లాలో పంట, పైరు, ఫలసాయం పంటలు, సంప్రదాయ పంటల స్థితిస్థాపకత ఛాయచిత్ర ప్రదర్శన, అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ జి.ఐ.జెడ్‌తో కేర్ పరిశోధనా ప్రాజెక్టు ద్వారా సాధించిన లక్ష్యాలు, ఫలితాలపై రైతులతో చర్చా కార్యక్రమంలో పాల్గొంటారు.



ధాన్యం కొనుగోలుపై జేసీ నిర్వహించిన అవగాహన సమావేశానికి హాజరైన రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు

ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి : జేసీ

పెనుగొండ, అక్టోబరు 9 : ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ఏర్పాట్లకు అధికారులు అన్ని విధాలా సంసిద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం పెనుగొండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై రెవెన్యూ, వ్యవసాయ శాఖ, పరపతి సంఘాలు, రైస్ మిల్లర్స్‌తో మండల స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2024-25కు సంబంధించి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు అన్నివిధాలా సిద్ధం కావాలన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లను ముందుగానే చేసుకోవాలన్నారు. సంచులను మిల్లర్ నుంచి ముందుగా సేకరించుకుని రైతు సేవా కేంద్రాలకు చేర్చి భద్రపరుచుకోవాలన్నారు. రైస్‌మిల్లర్లు రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే తీసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. తహసీల్దార్ జి.అనితకుమారి, ఏవో స్పందన, ఎంఎల్‌వో కె.రాధా కృష్ణ, ఎంపీడీవో పి.సూర్యనారాయణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగేళ్ల శ్రేష్ఠన్విత ప్రతిభ

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



మండవల్లి, అక్టోబరు 9: మండలంలోని మూడుతాళ్ళపాడు పంచాయతీ పరిధిలోని ఆనం దపురం గ్రామానికి చెందిన నాలుగేళ్ళ చిన్నారి ఇంటి శ్రేష్ఠన్విత ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. మహిళా పోలీసుగా పనిచేస్తున్న బుంగ ప్రమీలా, హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్న పవన్‌ల కుమార్తె శ్రేష్ఠన్విత ఇటీవల ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఇంగ్లీష్ అక్షరాలను వాటి సంఖ్యా క్రమం వరసలో అత్యంత వేగంగా పదమూడు సెకండ్ల పదిహేడు మిల్లీసెకండ్లు పఠించిన చిన్నారిగా గుర్తింపు పొందింది. ఈ చిన్నారి ప్రస్తుతం కైకలూరులోని ఒక ప్రైవేటు పాఠశాలలో యూకేజీ చదువుతోంది. ఈ చిన్నారి స్కూల్లో జరిగే నృత్యం, గానం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో చురుగ్గా పాల్గొంటుంది. తెలుగు గుణింతాలు, రాష్ట్రాలు వాటి రాజధానుల పేర్లు చక్కగా చెప్తుందని, ఇటీవల తమ కుమార్తె చేసిన వీడియో, ఆపద సమయంలో ఫోన్ చేయవలసిన నంబర్లు చెప్పిన విధానం ఎంతో అబ్బుర పరిచింది. మా మనవరాలు ప్రతిభను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించడం ఎంతో గర్వంగా ఉందని తాత బుంగా సంజీవరావు ఆనందం వ్యక్తం చేశారు.

పట్టభద్రుల నియోజకవర్గంలో పాగా వేద్దాం

ఓట్ల నమోదు వేగంగా సాగాలి

నిత్యం నియోజకవర్గాల సమీక్ష కొనసాగాలి

కూటమి విజయంలో మరో మైలురాయి అధిగమించాలి

ఏలూరులో పట్టభద్రుల ఓటర్ల నమోదుపై సమీక్ష



ఏలూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ఏలూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికలను కూటమి ప్రభుత్వం సవాల్‌గా తీసుకుంది. గడిచిన మూడు నెలల క్రితం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఎలాంటి విజయాలను కూటమి సొంతం చేసుకుందో అలాంటి గాలులే పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లోను వీయాలని, ఈ విషయంలో కూటమి నేతలంతా పక్కా ప్రణాళిక, పట్టుదలతో వ్యవహరించాలని కూటమి మంత్రులు, శాసన సభ్యులు ఒక నిర్ణయానికి వచ్చారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదుపై బుధవారం ఏలూరులో మంత్రి నిమ్మల రామానాయుడు నేతృత్వంలో ప్రత్యేకంగా చర్చించారు.

"గతంలో రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో టీడీపీ ప్రతిపక్షంలో ఉండగానే అప్పట్లో వైసీపీ అనుకూల అభ్యర్థులను చిత్తుగా ఓడించి మూడు ఎమ్మెల్సీ స్థానాలను దక్కించుకోగలిగాం.ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. యువకులు, రైతులు, మహిళల్లో స్పష్టమైన సానుకూలత ఉంది. పట్టభద్రుల నియోజకవర్గంలో గెలుపునకు ఇదే కారణం కావాలి" అని జల వనరుల శాఖ మంత్రి రామానాయుడు ప్రత్యేకంగా అందరికీ విజ్ఞప్తి చేశారు. కూటమి అభ్యర్థి విజయమే అందరి లక్ష్యం కావాలి. ఈ విజయాన్ని చంద్రబాబుకు అందించే బాధ్యత మనందరిదీ అంటూ మంత్రి కూటమి ఎమ్మెల్యేలు, మిగతా నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లో గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ భూతాన్ని తరిమికొట్టారు. ఇప్పుడు కూడా ఆ భూతానికి ఎక్కడా చోటు ఇవ్వకుండా చూడాలని నేతలందరికీ హితవు పలికారు. ప్రత్యేకించి ఓటర్ల నమోదు ప్రక్రియ ఒక పద్ధతి ప్రకారం కొనసాగాలని నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ, ఈ వ్యవహారాన్నీ చక్కదిద్దేందుకు ప్రత్యేకంగా కొందరికి బాధ్యతలు అప్పగించాలని సమావేశంలో నిర్ణయించారు. దీనిపై కూటమి నేతలందరికీ అవగాహన కల్పించాలని, పాత ఓటర్ల జాబితా అంటూ ప్రత్యేకంగా ఉండదని, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని 34 నియోజక వర్గాల్లో పట్టభద్రులను కొత్తగా చేర్చే బాధ్యతను అందరూ భుజానకెత్తుకోవాలని, నియోజకవర్గంలో మూడున్నర లక్షల మంది ఓటర్లకు అవకాశం ఉందని, ఆ మేరకు నియోజక వర్గాల వారీగా ఎవరంతట వారుగా చొరవ తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకోవాలని, పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. నవంబరు రెండో వారానికల్లా ఓటర్ల నమోదు ప్రక్రియ వేగంగా పూర్తి చేయాల్సిందేనంటూ దిశా నిర్దేశం చేశారు. 'మన ప్రభుత్వం అధికారంలో ఉంది. వైసీపీకి స్థానం లేకుండా అన్ని స్థానాల్లోను మనమే గెలిచాం. అన్ని హంగులు మన చేతిలోనే ఉన్నాయి. కావాల్సినంత ప్రజా సైన్యం మనవెంటే. కూటమి పక్షాన ఎవరిని నిలబెట్టినా వారికి మద్దతు ఇచ్చేందుకు ప్రజలు సైతం ఇప్పటికీ సంసిద్ధమే. జగన్ భూతాన్ని ఎట్టి పరిస్థితుల్లో రానివ్వకూడదు. ఆ దిశగానే మన ప్రతీ అడుగు వేయాలి' అంటూ ఓటర్ల నమోదుకు సంబంధించి ప్రత్యేకంగా నిర్దేశం చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి కూటమి ఎమ్మెల్యేలు, సీనియర్లు తరలివచ్చారు. దాదాపు గంటన్నరకు పైగానే సాగిన సమావేశంలో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కూటమిదే కావాలనే లక్ష్యాన్ని అమలు చేయాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, పితాని సత్యనారాయణ, పత్సమట్ల ధర్మరాజు, రోషన్‌కుమార్, బొలిశెట్టి శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రం కిశోర్, జనసేన ఉమ్మడి పశ్చిమ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, ఎమ్మెల్సీలు రెడ్డి సుబ్రహ్మణ్యం, చిరంజీవి, జడ్పీ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు శేషారావు, ఘంటా మురళీ, ఏపీ పరిశ్రమల కార్పొరేషన్ ఛైర్మన్ రామరాజు, తాడేపల్లిగూడెం కన్వీనర్ వలవల బాబ్జీ, నిడదవోలు కన్వీనర్ శేషారావు, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్, టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు రెడ్డి అప్పలనాయుడు, పాకా సత్యనారాయణ, మాలతీరాణి పాల్గొన్నారు.

అభ్యర్థి రాజశేఖరే..

ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.రాజశేఖర్ అని, అయితే దీనిపై అధికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉందని మంత్రి నిమ్మల ప్రకటించారు. ఐదేళ్ల వ్యవధిలో 20 లక్షల ఉద్యోగాలు, స్కిల్ సెన్సెస్‌తో ఉపాధి పనులకు అవకాశం, నియోజక వర్గాల అభివృద్ధే కాకుండా యువత, మహిళ, రైతుకు ప్రాధాన్యం ఇచ్చే దిశగా సీఎం చంద్రబాబు నాయుడు కష్టించి పనిచేస్తున్నారని, ఆ దిశగానే ఆయన ఇచ్చిన హామీలన్నీ వరుస వరుసగా అమలవుతాయన్నారు. ప్రజల నుంచి వచ్చిన తీర్పుతో వైసీపీ పాఠం నేర్చుకున్నట్టు లేదు. అందుకే తిరిగి వెర్రివేషాలు వేసేందుకు ప్రయ త్నించే ఆ పార్టీని ప్రజలే తిరిగి తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. వచ్చే పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియలో కూటమి నేత లంతా ఐక్యంగా ముందుకు కదులుతారని, ఆ ఎన్నికల్లో విజయం కూటమిదేనని మంత్రి రామానాయుడు ధీమా వ్యక్తం చేశారు.

టెంకాయ్ ధరలకు రెక్కలు

సైజు బట్టి కొబ్బరికాయల అమ్మకాలు

దిగుబడి తగ్గిపోవడంతో పెరిగిన డిమాండ్

కాయ ఒక్కటి రూ.20 నుంచి రూ.40 వరకు..

ధరలు చూసి అవాక్కవుతున్న భక్తులు



పెంటపాడు, అక్టోబరు 9 : మార్కెట్‌లో కొబ్బరి కాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. దసరా శరన్నవరాత్రులు కావడంలో ఈ తొమ్మిది రోజులు అమ్మవారి ఆలయాలకు వెళ్ళే భక్తులు కొబ్బరికాయల ధరలను చూసి నోరెళ్ల బెడుతున్నారు.రెండు నెలలుగా కొబ్బరి కాయలకు బాగా డిమాండ్ పెరిగింది. మార్కెట్‌లో కాయలు అసలు దొరకడం లేదు. దీంతో ధరలను కూడా విపరీతంగా పెంచేశారు.

తమిళనాడు నుంచే ఎక్కువ దిగుమతి



వాస్తవానికి ఆంధ్రాకు వచ్చే కొబ్బరి కాయలు ఎక్కువ శాతం తమిళ నాడు రాష్ట్రం నుంచే దిగుమతి అవుతాయి. ఈ ప్రాంతాలలో హోల్‌సేల్ గా కొబ్బరి కాయల వ్యాపారాలు చేసేవారు తమిళనాడు నుంచే కొబ్బరి కాయలు దిగుమతి చేయించుకుంటారు. సాధారణంగా తమిళనాడు నుంచి వచ్చే కొబ్బరి కాయల ధర టన్నుకు రూ 27 వేల నుంచి రూ 30 వేలు ఉండేది. అయితే దసరా మహోత్సవాల సందర్భంగా ఉత్సవాలు వైభవంగా జరిగే ఉత్తరప్రదేశ్, బిహార్, కోలకతా, ముంబయి తదితర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఇక్కడ దిగుమతి అయిన కొబ్బరి కాయలను టన్నుకు రూ.55 వేల నుంచి 60 వేలు ఇచ్చి కొనుగోలు చేసి తీసుకువెళ్ళిపోయారు. రెండు నెలల కాలంగా లక్షల టన్నులు కొబ్బరి కాయలు ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అయిపోయాయి. అలాగే తమిళనాడు నుంచి కూడా ఎక్కువ సొమ్ములు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో హోల్‌సేల్‌గా కొబ్బరి కాయల వ్యాపారాలు చేసే షావుకార్లు కూడా ఎక్కువ స్థాయిలో డబ్బులు వస్తున్నందుకు ఇతర రాష్ట్రాల వారికే అమ్మకాలు జరిపారు. దీంతో మార్కెట్‌లో కొబ్బరికాయలు దొరకడమే తక్కువ అయిపోయింది. ఫలితంగా కొబ్బరి కాయల ధరలకు రెక్కలు వచ్చాయి.

బొండాలు అమ్మేస్తున్నారు..

సాధారణంగా కొబ్బరి బొండాలకు వేసవి కాలంలో బాగా ఎక్కువ డిమాండ్ ఉంటుంది. అయితే ప్రస్తుత వర్షాకాలంలో కూడా వేసవిని తలపించేలా ఎండలు మండి పోతున్నాయి. దీంతో కొబ్బరి బొండాలకు మంచి డిమాండ్ పెరిగింది. బొండం ధర సైజును బట్టి రూ.30 నుంచి రూ.40 వరుకూ అమ్మకాలు సాగిస్తున్నారు. కొబ్బరి కాయ దిగుబడి తక్కువ అవడానికి ఇది కూడా ఒక కారణం అంటున్నారు వ్యాపారులు. కొబ్బరి కాయ దించాలంటే రెండున్నర నెలల నుంచి మూడు నెలల వరుకూ ఆగాల్సి వస్తుంది. అదే బొండాలు అయితే నెల దాటితే చాలు దిగిపోతాయి. ధర ఎక్కువ వస్తున్న కారణంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోని కొబ్బరి తోట యజమానులు ఎక్కువ శాతం బొండాలు అమ్మకాలు జరుపుతున్నారు. ఫలితంగా కొబ్బరి కాయలకు గిరాకీ పెరిగిపోయింది.

రూ.20 నుంచి రూ.40కు విక్రయాలు

కొబ్బరి కాయల దిగుబడి తగ్గిపోవడంతో కాయల ధరలు కూడా బాగా పెరిగిపోయాయి. గతంలో రూ.10 రూ.15 కూడా కాయలు దొరికేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కాయ రూ.20 నుంచి రూ 30 వరుకూ అమ్ముతున్నారు. అదే ఆలయాల వద్ద అయితే కాయ సైజును బట్టి రూ.40 నుంచి రూ 50 వరుకు విక్రయాలు జరుపుతున్నారు. దీంతో ఆలయాలకు కొబ్బరి కాయలు తీసుకు వెళ్ళే భక్తులు ధరలు చూసి వణికిపోతున్నారు.

మార్కెట్‌లో కాయలు దొరకడం లేదు



మార్కెట్‌లో అసలు కొబ్బరి కాయలు దొరకడం లేదు. తమిళనాడు నుంచి వచ్చే కాయలు కేజీ రూ.25 నుంచి రూ.30 వరుకూ కొనుగోలు చేసి అమ్మ కాలు జరుపుకునే వాళ్ళం. కానీ దిగుబడి తగ్గిపోవడం వల్ల మార్కెట్‌లో కొబ్బరికాయలు దొరకడం లేదు.దీంతో మేమే హోల్‌సేల్ వ్యాపారస్తుల నుంచి ధర ఎక్కువ పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తున్నది. దీనివల్ల మేము కూడా మరికొంత వేసుకుని అమ్మకాలు జరుపుతున్నాం.

- రంగ, కొబ్బరికాయల వ్యాపారి, తాడేపల్లిగూడెం



దెందులూరు ఎస్ఐపై ఐజీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం

బాలిక అత్యాచార ఘటనలో ఎస్ఐపై చర్యలు

తీసుకోవాలంటూ ఐజీకి ఎమ్మెల్యే చింతమనేని ఫిర్యాదు

ఏలూరు క్రైం, అక్టోబరు 9 : దెందులూరు మండలానికి చెందిన ఒక బాలికపై ఒక యువకుడు అత్యాచారం చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తక్షణం దర్యాప్తు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం రాత్రి ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్‌ను కోరారు. కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వ్యవహరించిన దెందులూరు ఎస్ఐ స్వామిపై చర్యలు తీసుకోవాలని మైనర్ బాలిక, కుటుంబ సభ్యులతో కలిసి ఐజీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు అందించారు. దెందులూరు మండలానికి చెందిన ఒక బాలికను ద్వారకా తిరుమల మండలానికి చెందిన ఒక యువకుడు (17) మాయమాటలు చెప్పి ఐదు నెలలుగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె గర్భం దాల్చడంతో నెల రోజుల క్రితం దెందులూరు పోలీసులకు బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి నిందితుడు, అతని కుటుంబ సభ్యులు బాధితురాలిని ఆమె కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నాడు. ఎస్ఐ ఈ సంఘటనపై కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. పోక్సో కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని కోరారు.అనంతరం ఐసీడీఎస్ అధికారులకు ఫోన్‌చేసి బాధితురాలికి మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని,బాలిక యోగ క్షేమాలు పట్టించుకోని అంగన్ వాడీ సిబ్బందిపై కూడా విచారణ జరపాలని ఎమ్మెల్యే సూచించారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

భీమవరం అర్బన్, అక్టోబరు 9 : జాతీయ పోస్టల్ వారోత్సవాల సందర్భంగా భీమవరం పోస్టల్ డివిజన్ పరిధిలోని తాడేరు, దగ్గులూరు, రేలంగి, తేతలి గ్రామాలలో ఈనెల 10వ తేదీ నుంచి ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని భీమవరం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్వీ సత్యనారాయణరాజు తెలిపారు. ఈ క్యాంపులో నూతన ఆధార్ నమోదు, అడ్రస్ అప్డేషన్, బయోమెట్రిక్ అప్డేషన్, మొబైల్ నంబరు అప్డేషన్, ఆధార్ అప్డేషన్ అందుబాటులో ఉంటాయని ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రైమ్ కార్నర్

డీప్యూటీ సీఈవో ఇంట్లో చోరీ



బీరువా తెరిచి చిందరవందరగా పడిన సామాన్లు

నరసాపురం టౌన్, అక్టోబరు 9 : నరసాపురం పట్టణంలోని థామస్ వంతెన వద్ద నివాసం ఉంటున్న మచిలీపట్నం జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద కుమార్ నివాసంలో చోరీ జరిగింది. మూడు కాసుల బంగారం, కేజీ వెండి అపహరించుకుపోయారు. కుటుంబ సభ్యులంతా వారం రోజుల క్రితం ఊరు వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు తీసి సామాన్లు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. వెంటనే ఆయన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని సీఐ యాదగిరి పరిశీలించి క్లూస్ టీమ్‌ను రప్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఇదిలా ఉంటే ఇటీవల పట్టణంలో వరుస చోరీలు జరుగు తున్నాయి. తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్ చేసి దొంగతనాలు చేస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో సైకిలిస్ట్ మృతి



నరసాపురం, అక్టోబరు 9: మార్కెట్ నుంచి ఇంటికి సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్టు నరసాపురం సీఐ యాదగిరి తెలిపారు. నరసాపురానికి చెందిన కె. దుర్గాప్రసాద్ (35) బుధవారం రాత్రి మార్కెట్ నుంచి సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా సూర్యా కళాశాల వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్ సంఘటనా స్థలంలో మృతి చెందినట్టు సీఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

పంటబోదెలో శిశువు మృతదేహం

కాళ్ళ, అక్టోబరు 9 : పంట బోదెలో నవజాత శిశువు మృతదేహం గుర్తించినట్లు వచ్చిన ఫిర్యాదుపై బుధవారం కాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. కాళ్ళ మండలం ప్రాతాళ్ళమెరక గ్రామంలో దీపాటి వజ్రమ్మ ఇంటి సమీపంలోని ఒక బోదెలో బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో సుమారు 7 నుంచి 8 నెలలు వయసు గల మగశిశువు మృతదేహాన్ని స్థానికులు గమనించారు. విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కాళ్ళ పోలీసు సిబ్బంది పరిశీలించి మృతదేహాన్ని వెలికి తీశారు. దీనిపై వజ్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాళ్ళ ఎస్ఐ నాళం శ్రీనివాసరావు అనుమానస్పద శిశువు మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాలువలో గల్లంతైన మృతదేహం లభ్యం

తణుకు, అక్టోబరు 9 : తేతలి గ్రామానికి చెందిన భవాని భక్తుడు కాజా దుర్గాప్రసాదు మంగళవారం రాత్రి అత్తిలి కాలువలో స్నానం కోసం వెళ్ళి ప్రమాదవశాత్తు గల్లంతైన సంగతి తెలిసింది.ముమ్మర గాలింపు నేపథ్యంలో పైడిపర్రు కాలువ వద్ద భవాని మృతదేహం బుధవారం కనుగొన్నారు. పంచనామ అనంతరం పోస్టుమార్టంకు తరలించారు.

భార్య మందలించిందని ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, అక్టోబరు 9 : భార్య మందలించిందని ఒక యువకుడు పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం పోణంగి గ్రామానికి కారే కుమారస్వామి (29) భార్య భవాని, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. తాపీ పనులు చేస్తున్నాడు. అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. రెండు రోజుల నుంచి ఏ పని చేయకుండా మద్యం తాగడంతో భార్య మందలించింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై బుధవారం ఉదయం పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు. అతనిని కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు వచ్చారు. అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మహిళను బెదిరించిన కేసులో 9 నెలల జైలు శిక్ష

ఏలూరు క్రైం, అక్టోబరు 9 : ఇంట్లో ఒంటరిగా ఉన్న ఒక మహిళ వద్దకు ఓ యువకుడు వచ్చి తన ఆరోగ్య శాఖ నుంచి వచ్చానని చెప్పి ఆధార్ కార్డులు పరిశీలన చేయాలని అనడంతో ఇంట్లోకి వెళ్ళిన ఆ మహిళ వద్దకు వెంటనే వెళ్ళి బొమ్మ తుపాకీ, చాకు చూపించి బెదిరించి చేతిలో ఉన్న రెండు వందల రూపాయల నగదు ఉన్న పర్సును అపహరించుకు పోయినట్లు నేరం రుజువైంది. దీంతో అతనికి 9 నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని సెకండ్ ఏజేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ బండి రచన తీర్పు బుధవారం చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన పసుపులేటి అజయ్‌కుమార్ అలియాస్ అజయ్ అలియాస్ అరుణశాస్త్రి (39) ప్రస్తుతం పెదవేగి మండలం వేగివాడలో ఉంటున్నాడు. 2014 నవంబరు 24వ తేదీ ఏలూరు బావిశెట్టివారిపేటలో ఉంటున్న పామర్తి వరలక్ష్మి (50) వద్దకు వచ్చాడు. తాను ఆరోగ్యశాఖ నుంచి వచ్చానని ఆధార్‌కార్డులు జిరాక్స్‌లు ఇవ్వాలని పరిశీలన చేయాలని చెప్పాడు. ఆమె బీరువావద్దకు వెళ్ళగా వెనుకనుంచి వచ్చిన అతను ఆకస్మాత్తుగా డమ్మీ లాంటి వస్తువు, చాకు తీసి బెదిరించాడు. దీంతో ఆమె చేతిలో ఉన్న పర్సు కింద పడిపోయింది. ఆమె కేకలు వేయడంతో ఆ పర్సు తీసుకుని పారిపోయాడు. ఈ సంఘటనపై బాధితురాలు ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ కె.నాగేంద్ర ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడైన పసుపులేటి అజయ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చిన అతను కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా పరారీలో ఉండడంతో కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో పోలీసులు అతనిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. అతనిపై నేరం రుజువు కావడంతో 9 నెలల జైలు శిక్ష, 1000 రూపాయలు జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ శ్రీబండి రచన తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయశ్రీ వాదించగా ఏలూరు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ వైఎస్ మూర్తి సహకరించారు.

ఆపరేషన్ చేసి రెండు నెలలైనా తగ్గని పుండు

ఆసుపత్రి వైద్యుని నిర్లక్ష్యంపై బాధితురాలి ఆందోళన



ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న బాధితురాలు,కుటుంబ సభ్యులు

ఏలూరు క్రైం, అక్టోబరు 9 : కడుపునొప్పితో ఉన్న ఒక మహిళ ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్ళి ఆపరేషన్ చేయించుకుంటే అది ఇన్‌ఫెక్షన్ అయింది. భయంతో ఆపరేషన్ చేసిన వైద్యుని వద్దకు వెళ్ళి అడిగితే అలానే ఉంటుందని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారంటూ బాధితురాలితో పాటు వారి కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందో ళనకు దిగారు. ఉన్నతాధికారులకు ఆ వైద్యునిపై ఫిర్యాదు చేశారు. బాధి తులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన మలపరెడ్డి ఉమాభారతి (28) ఈ ఏడాది జులై 24న ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చూపించుకోగా అక్కడ ఉన్న వైద్యులు దుర్గా ప్రసాద్ ఆపరేషన్ చేయాలని సూచించారు. వెంటనే ఆసుపత్రిలో చేరారు. అదే నెల 27వ తేదీన ఆపరేషన్ చేశారు. ఆగస్టు 5వ తేదీన డిశ్చార్జి అయ్యారు. ఆపరేషన్ చేసిన ప్రాంతం నుంచి పసరావడం, పుండు మానకపోవడంతో అనేక మార్లు ఆ వైద్యుని సంప్రదించగా అలానే ఉంటుందని తగ్గుతుందని రెండు నెలల నుంచి నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. దీంతో బాధితురాలు, కుటుంబ సభ్యులు బుధవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి మరోసారి డాక్టర్ దుర్గాప్రసాద్‌ను ప్రశ్నించారు. అప్పటి కూడా అయన నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో చివరకు ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ సుధాకర్ దృష్టికి తీసుకువెళ్ళగా ఆసు పత్రిలో చేరాలని వేరే వైద్యుల చేత వైద్యం చేస్తామని చెప్పారు. అయితే ఆ వైద్యునిపై చర్యలు తీసుకోవాల్సిందేనని వారు డిమాండ్ చేశారు.ఈ మేరకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

కేసులు ఎత్తి వేయాలని వినతి



ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

ఏలూరు క్రైం, అక్టోబరు 9 : సీపీఎస్ ఉద్యమంలో పాల్గొన్న జేఏసీ నాయకులపై గత ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తి వేయాలని ఏపీఎన్‌జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, వివిధ సంఘ నాయకులతో కలిసి జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్‌ను కోరారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయానికి బుధవారం రాష్ట్ర అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెర్సు రామారావు, పీఆర్‌టీయూ అధ్యక్షులు పువ్వుల ఆంజనేయులు, ఏపీటీఎఫ్ అధ్యక్షులు గగ్గులోతు కృష్ణ, డీటీఎఫ్ అధ్యక్షులు ఆదినారాయణ వెళ్లి ఎస్పీ కిశోర్‌కు వినతిపత్రాన్ని అందించారు. 2022 ఆగస్టులో సీపీఎస్ ఉద్యమంలో పాల్గొన్న జేఏసీ నాయకులపై గత ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టారని వాటిని ఎత్తివేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ స్పందిస్తూ కలెక్టర్‌కు ఫైల్ పెట్టి ఉద్య మంలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. అదే విధంగా ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలోని 1965 లిటరసీ రిక్రియేషన్ సెంటర్ (ఎల్‌ఆర్‌సీ)కి 13 సెంట్ల భూమి ఉందని ఆ భూమిని కొంత మంది ఆక్రమించి సంఘ వ్యతి రేక కార్యలాపాలు నిర్వహిస్తున్నారని జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్ ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. అక్రమార్కులపై కేసు పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

ధరల నియంత్రణకు చర్యలు

జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

ఏలూరు సిటీ, అక్టోబరు 9: ధరల నియంత్రణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు హోల్‌సేల్ వ్యాపారులతో బుధవారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్, దాల్ మర్చంట్స్ అసోసియేషన్, వెజిటబుల్స్ హోల్ సేల్, రిటైల్ వ్యాపారులతో చర్చలు జరిపారు. ధరలు తగ్గించేందుకు వ్యాపారులు అంగీకరించారని జేసీ ధాత్రిరెడ్డి చెప్పారు. టమోటాలు కిలో రూ.50 , ఉల్లిపాయిలు కర్నూల్ రకం కిలో రూ.38, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.127, పామాయిల్ రూ.120లకు జిల్లాలోని రైతు బజార్లు, బహిరంగ మార్కెట్లో గురువారం నుంచి విక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.





సరస్వతిదేవి అలంకారంలో అంబికాదేవి, పత్తేబాద కనకదుర్గమ్మ



ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ

సరస్వతిదేవిగా దర్శనం



బావిశెట్టివారిపేటలోని కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న జడ్పీ చైర్మన్ దంపతులు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 9 : దేవీ నవరాత్రుల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రం నేపథ్యంలో అమ్మవారిని సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. విద్యార్థులు అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. సత్రంపాడులోని అంబికాదేవి, సౌభాగ్యలక్ష్మిదేవి, దక్షిణపువీధిలోని మహిషాసురమర్దినిదేవి, బాల త్రిపుర సుందరిదేవి, అగ్రహారంలోని జ్ఞాన సరస్వతి దేవి, రాజ్యలక్ష్మిదేవి, కన్యకాపరమేశ్వరి, పవరుపేట లోని కాశీ అన్నపూర్ణాదేవి, పత్తేబాద, బావిశెట్టివారిపేట, సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు.

● ద్వారకాతిరుమల : సరస్వతీ దేవి అలంకారంలో కుంకుళ్లమ్మ భక్తులను అనుగ్రహించారు. మూల నక్షత్రం పురస్కరించుకుని వీణాపాణియై, అక్షరమాలను ధరించి, అభయ హస్తాన్ని ప్రసాదిస్తున్న కుంకుళ్లమ్మను భక్తులు దర్శించుకున్నారు.

సమర్థవంతమైన పాలన అందిస్తాం



కోఆప్షన్ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు రూరల్, అక్టోబరు 9: సమర్థవంతమైన పాలన అందించేందుకు సమష్టి చర్యలకు శ్రీకారం చుట్టినట్లు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన కొల్లేపల్లి రాజు, చోడే వెంకటరత్నంనాయుడు, జాలా సుమతి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బడేటి చంటిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంటి వారిని అభినందించి మాట్లాడారు. నగర పాలక సంస్థలో చేపట్టిన పరిపాలనాపరమైన మార్పులపై స్పష్టత ఇచ్చారు. అనుభవానికి పట్టం కట్టాలనే ఆలోచనతో అనుభవం ఉన్న ముగ్గురు నాయకుల కు పదవులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ నూర్జహాన్, టీడీపీ నగర అధ్యక్షుడు పెద్దిబోయిన శివప్రసాద్, బొద్దాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణ

ఏలూరు రూరల్, అక్టోబరు 9: సాంఘిక గిరిజన సంక్షేమ శాఖ, ప్రభుత్వం సంయుక్తంగా 5,050 మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జయప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేయబడిన శిక్షణా సంస్థల్లో, సాంఘిక, గిరిజన సంక్షేమశాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్లో నిర్వహించబడుతుందన్నారు. ఎంప్లాయిమెంట్ కోసం దరఖాస్తు చేసుకునే శిక్షణా సంస్థలు కనీసం గత రెండు డీఎస్సీ రిక్రూట్ మెంట్‌లకు కోచింగ్ ఇచ్చి ఉండాలన్నారు. డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో వంది మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొంది ఉండాలన్నారు. వివరాలకు ఈవోఐ డాక్యుమెంట్‌ను ఏపీ ఈ-ప్రొక్యూర్ మెంట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గాంధీ మందిరాన్ని అభివృద్ధి చేయాలి

ఏలూరు అర్బన్, అక్టోబరు 9 : సర్వోదయ నాయకులు సీహెచ్‌వీపీ మూర్తిరాజు పెదనిండ్రకొలనులో నిర్మించిన దేశంలోనే అతిపెద్ద గాంధీ స్మారక మందిరాన్ని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని అభ్యర్థిస్తూ తీర్మానం చేసినట్లు ఉమ్మడి జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇ.ప్రసాదరాజు, సంయుక్త కార్యదర్శి ఎస్.జానకి రామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీఎం చంద్రబాబుకు రాసిన లేఖ ప్రతిని పత్రికలకు విడుదల చేశారు.

బేటీ బచావో... బేటీ పడావోపై అవగాహన

ఏలూరు క్రైం, అక్టోబరు 9 : సమన్వయంతో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రి సెల్వి మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్సు ద్వారా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ లోప పోషణ పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక ప్రణాళిక వేసుకోవాలని ఆదేశించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వాటిక ఏర్పాటు చేయాలని, ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ లోపు అన్ని కేంద్రాల్లో మొక్కలు నాటాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో పరిశుభ్రత పాటించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరచిన అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకులు, పర్యవేక్షకులు, సీడీపీవోలకు ప్రశంసా పత్రాలు ఇస్తామన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ కె.పద్మావతి, జిల్లా సీడీపీవోలు, పర్యవేక్షకులు హాజరయ్యారు.

స్థల పరిశీలించిన

ద్వారకాతిరుమల, అక్టోబరు 9 : ఎంపీ, ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీ మేరకు నాయీ బ్రాహ్మణులకు కేటాయించిన స్థలాన్ని జేసీ ధాత్రిరెడ్డి బుధవారం పరిశీలించారు. స్థానిక కోత మిషన్ వెనుక ఉన్న ఈ స్థలాన్ని తహసీల్దార్ సుబ్బారావు, రెవెన్యూ సిబ్బందితో కలసి పరిశీలించారు. త్వరలో ఎంపీ పుట్టా మహేశ్, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజులతో శంకుస్థాపన చేయిస్తామని ఏలూరు జిల్లా సాధికారిక కమిటీ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు.

ఎన్నికల్లో బీజేపీ విజయంపై హర్షం

ఏలూరు రూరల్, అక్టోబరు 9: హర్యానా, జమ్మూకశ్మీర్‌లో బీజేపీ ఘన విజయం, సాధించిన సందర్భంగా ఏలూరు జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షుడు సిహెచ్ విక్రమ్ కిశోర్ మాట్లాడుతూ దేశమంతా బీజేపీ హవా కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ ఆరు సీట్లకే పరిమితమైతే కశ్మీర్‌లో బీజేపీ 29 సీట్లు సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో కె.కృష్ణప్రసాద్, దానభాస్కర్‌రావు, ఆడపాక సురేష్, నాగం శివ, రాజశేఖర్, విజయ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరుకు రెగ్యులేటర్లు నిర్మించాలి

ఏలూరు రూరల్, అక్టోబరు 9: కొల్లేరుకు రెగ్యులేటర్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని, కొల్లేరు భూములు ఉప్పునీటి కయ్యలుగా మారకుండా చర్యలు తీసుకోవాలని, కొల్లేరు వరదతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏలూరు రూరల్ మండల పరిధిలోని కలకుర్రు సమీపంలో బుధవారం పెదయడ్లగాడి వద్ద నాయకులు కొల్లేరును పరిశీలించారు. వరద ముంపు సమస్యలను రైతులను కొల్లేరు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కొల్లేరుకు వరద రావడంతో ఆక్వా, వరి రైతులకు తీవ్రనష్టం జరిగిందన్నారు. కొల్లేరు వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని, డిమాండ్ చేశారు. ఘంటసాల పెద్దిరాజు, రాజేంద్రప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం

ఏలూరు రూరల్, అక్టోబరు 9: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్ల కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేఖత ప్రారంభమైందని, వైసీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సీఎస్ఐ స్కూల్ సమీపంలో వైసీపీ జిల్లా ఏలూరు నియోజకవర్గ కార్యాలయాలను బుధవారం ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్‌తో కలిసి ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యేలు కె.వాసుబాబు, మేకా వెంకటప్రతాప్ అప్పారావు, బాలరాజు, వైసీపీ నాయకులు కె.విజయ్ కుమార్, శ్రీనివాస్, సుధీర్ బాబు, చిరంజీవి, కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



భీమడోలు, అక్టోబరు 9 : గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వర ఆటో ఓనర్స్ డ్రైవర్స్ సంక్షేమ సంఘం నూతన కమ్యూనిటీ హాలు భవనాన్ని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆటో యూనియన్ సభ్యుల సమస్యలడిగి తెలుసుకున్నారు. యూనియన్‌కు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆటో యూనియన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జర భద్రం

పెదపాడు, అక్టోబరు 9 : సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ స్పందించవద్దని పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్‌శివకిషోర్, నూజివీడు డీఎస్పీ కేవీవీఎస్వీ ప్రసాద్ ఆదేశాల మేరకు కొత్తూరులో సైబర్ నేరాలు, దొంగతనాలపై అవగాహన కల్పించారు. సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి ఫోను చేసి తగిన సహాయం పొందాలన్నారు. అనంతరం గ్రామ కమ్యూనిటీ హాలులో గ్రామస్తులతో కలిసి నిద్రించారు. ఎస్సై కట్టా శారదసతీష్, హెచ్‌సీలు సువర్ణరాజు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

హైవే ఫ్లైఓవర్ బ్రిడ్జికి సర్వే

ఉంగుటూరు, అక్టోబరు 9 : జాతీయ రహదారిపై కైకరం వద్ద హైవే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి జాతీయ రహదా రుల విభాగం, రెవెన్యూ సిబ్బంది బుధ వారం సర్వే నిర్వహించారుప డిప్యూటీ ఇనస్పెక్టర్ ఆఫ్ సర్వే రమణ, మండల సర్వేయర్ విశ్వనాథ్, హైవే సర్వే అధికారి సత్యనారాయణ, సైట్ ఇంజనీర్ సాయి నాథ్, విలేజ్ సర్వేయరు మణికుమారి, మణికంఠ, వెంకట్ పాల్గొన్నారు.

కేసులు ఎత్తి వేయాలని ఎస్పీకి వినతి




ఏలూరు క్రైం, అక్టోబరు 9 : సీపీఎస్ ఉద్యమంలో పాల్గొన్న జేఏసీ నాయకులపై గత ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తి వేయాలని ఏపీఎన్‌జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, వివిధ సంఘ నాయకులతో కలిసి జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్‌ను కోరారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయానికి బుధవారం రాష్ట్ర అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెర్సు రామారావు, పీఆర్‌టీయూ అధ్యక్షులు పువ్వు ల ఆంజనేయులు, ఏపీటీఎఫ్ అధ్యక్షులు గగ్గులోతు కృష్ణ, డీటీఎఫ్ అధ్యక్షులు ఆదినారాయణ వెళ్లి ఎస్పీ కిశోర్‌కు వినతిపత్రాన్ని అందించారు. 2022 ఆగస్టులో సీపీఎస్ ఉద్యమంలో పాల్గొన్న జేఏసీ నాయకులపై గత ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టారని వాటిని ఎత్తివేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ స్పందిస్తూ కలెక్టర్‌కు ఫైల్ పెట్టి ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. అదే విధంగా ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలోని 1965 లిటరసీ రిక్రీయేషన్ సెంటర్ (ఎల్‌ఆర్‌సీ)కి 13 సెంట్ల భూమి ఉందని ఆ భూమిని కొంత మంది ఆక్రమించి సంఘ వ్యతి రేక కార్యలాపాలు నిర్వహిస్తున్నారని జేఏసీ ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్ ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. అక్రమార్కులపై కేసు పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

చదువుల తల్లి సరస్వతీదేవిగా దర్శనం



రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మ



ఉంగుటూరు చల్లాలమ్మ



గుండుగొలనులో సరస్వతి దేవిగా

పెదవేగి, అక్టోబరు 9 : శరన్నవరాత్రులలో రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మవారు ఏడోరోజు బుధవారం చదువులతల్లి సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చేతిలో వీణతో జ్ఞానాన్ని పంచే జ్ఞానసరస్వతిగా శ్రీరాట్నాలమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి లలితా సహస్రనామ అష్టోత్తర సహిత దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. ఈవో ఎస్.సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● పెదపాడు : స్థానిక శివాలయంలో విద్యార్థులకు విద్యాబుద్ధులు ప్రసాదించమని కోరుతూ సరస్వతీ పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, భక్తులు సరస్వతీ అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

● భీమడోలు : భీమడోలు, గుండుగొలను, పూళ్ళ తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గుండుగొలనులో వేంచేసిన భ్రమరాంబమల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి పంచామృత నవరసఫల అభిషేకాలు, మహిళలతో సామూహిక కాత్యాయని వ్రతాలు, విద్యార్థులతో సరస్వతి పూజలు నిర్వహించారు. అమ్మవారిని సరస్వతి దేవి అలంకరణతో అలంకరించి పూజలందించారు.

● ఉంగుటూరు : విజ్ఞాన భారతి పాఠశాలలో, భద్రకాళి ఆలయంలోను సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. గ్రామ దేవత చల్లాలమ్మవారు బుధవారం కాళరా త్రిగా అవతారమెత్తారు.

● నిడమర్రు : ఫత్తేపురం, నిడమర్రు, భువ్వనపల్లి, పెద నింద్రకొలను, సిద్ధాపురం, అడవికొలను గ్రామాలలో కొలువుదీరిన అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు. ఫత్తేపురం శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయలో, అడవికొలను కేశవస్వామి ఆలయంలో విద్యార్థులు సరస్వతిదేవి పూజలు చేశారు. పెదనింద్రకొలను చెరువు గట్టు వద్ద ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాలలో సరస్వతి అమ్మవారి అలంకరణ అందరినీ అలరించింది.

చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలి



పెదపాడు మండలం రాజుపేటలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పెదపాడు, అక్టోబరు 9 : వరి పంటలను ఆశిస్తున్న చీడపీడలు నివారణకు రైతులు సకాలంలో తగు చర్యలు తీసుకోవాని ఏవో వి.ప్రదీప్ కుమార్ తెలిపారు. రాజుపేట, తోటగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి క్షేత్రస్థాయిలో వరి పంటలో తెగుళ్ల గుర్తింపు, నివారణా చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. జి.కళ్యాణ్, పి.రమేష్, సురేష్, హిమంత్ తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : కైకరం పంట పొలాల వద్ద రైతు భరోసా కేంద్రంలోను రైతుల సమస్యలను అధికారులు నివృత్తి చేశారు. సర్పంచ్ ఎస్.గోపి, సచివాలయ కార్యదర్శి శివ, ఏవో ప్రవీణ్ కుమార్, వెటర్నరీ వైద్యులు పప్పు అశోక్, పాల్గొన్నారు.

● పెదవేగి : పెరుగుతున్న పెట్టుబడులకు అనుగుణంగా సాగులో ఆధునిక సాంకే తిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని దిగుబడులను పెంచుకోవాలని ఏవో ఎం.ప్రియాంక అన్నారు. పెదవేగి మండలం గార్లమడుగు, కవ్వగుంట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులకు ఆధునిక వ్యవసాయ విధానం, యాంత్రీకణతో పెరిగే దిగుబడులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రియాంక వ్యవసాయానికి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గార్లమడుగు సర్పంచ్ జి.నాగరాజు, టీడీపీ నాయకులు కె.సత్య నారాయణ చౌదరి, ఎం.సీతారామదాసు, గణేష్, ఉద్యాన శాఖాధికారి రత్నమాల పాల్గొన్నారు.

మందుగుండు సామగ్రి స్వాధీనం

లింగపాలెం, అక్టోబరు 9: ఎవరైనా పేలుడు పదార్థాలు, మందు గుండు సామగ్రి అక్ర మంగా కలిగి ఉంటే చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.వెంకన్న అన్నారు. తమకు అందిన సమాచారం మేరకు కుప్పాలవారిగూడెంలో రూ.16,850ల విలువ గల మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకునట్లు తెలిపారు.

అన్న సమారాధన

ఉంగుటూరు, అక్టోబరు 9 : వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా కైకరంలో శ్రీకృష్ణ దేవరాయ కాపు సం ఘం, రంగా యువ సేన గౌరవాధ్యక్షులు వి.సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం అన్న సమారాధన నిర్వహించారు.

ప్రపంచ తపాలా దినోత్సవం

భీమడోలు, అక్టోబరు 9 : ప్రపంచ తపాలా దినోత్సవాన్ని సందర్భంగా భీమడోలు శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథపాలకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సామాజిక కార్యకర్త ఎం.సుధాకర్ తపాలా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు.
















































ప్రజలకు ఉపయోగపడేలా ఉపాధి పనులు

కొయ్యలగూడెం, అక్టోబరు 9: ఉపాధి హామీ పథకం ప్రజలకు ఉపయోగపడేలా అమలు చేయాలని ఎంపీడీవో కిరణ్ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఉపాధి హామీ పథకం ఉద్యోగులతో బుధవారం సమావేశమయ్యారు. ఎవరైన ఉపాధి హామీ సిబ్బంది అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీవో నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యకర్తలకు అండగా తెలుగుదేశం

లింగపాలెం, అక్టోబరు 9: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజీగూడెంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో చింతలపూడి నియోజకవర్గం పైలెట్ ప్రాజెక్టుగా ఉందన్నారు. మండలానికి పంచాయతీరాజ్ రోడ్లకు రూ.కోటిలు మంజూరయ్యాయని, దసరా అనంతరం పనులు ప్రారంభిస్తామన్నారు. గరిమెళ్ళ చలపతిరావు, గారపాటి బుజ్జియ్య, పాతూరి శ్రీనివాసరావు, వేంపాటి ప్రసాద్, మొరంపూడి మల్లిఖార్జునరావు,మొరంపూడి ప్రసాద్, నత్తా నాగేంద్ర, చెరువుగట్టు రామ్మోహన్‌రావు, గజ్జా వెంకటేశ్వరరావు, బొంతు గిరిబాబు, ముసునూరి రాము, కూరపాటి వెంకటేశ్వరరావు, జనసేన నాయకుడు నాగబాబు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● చింతలపూడి : టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కోరారు. రాఘవాపురంలో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తొలి సభ్యత్వ రెన్యూవల్ ను మాజీ ఏఎంసీ అధ్యక్షుడు జె.ముత్తారెడ్డి నమోదు అందజేశారు.

● జంగారెడ్డిగూడెం : పట్టణ టీడీపీ కార్యాలయం వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ ప్రారంభించారు. సభ్యత్వ నమోదులో చింతలపూడి నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. స్మార్ట్ ఫోన్ నుంచి సెల్ఫ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ద్వారా కూడా సభ్యత్వాన్ని పొందవచ్చన్నారు. నాయకులు ఎం.రామ్మోహనరావు, ఎస్.జగత్, బి.రాజ్‌పాల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


చింతలపూడిలో ముత్తారెడ్డికి తొలి సభ్యత్వం అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్



వైసీపీ నుంచి బీజేపీలోకి చేరికలు



పోలవరం, అక్టోబరు 10 : గూటాల పంచాయతీ మహాలక్ష్మి దేవి పేటలో వైసీపీ నాయకులు జి.శ్రీనివాస్ నివాసం వద్ద ఆయనతో పాటు మరో 50 మంది పాతపట్టిసీమకి చెందిన వైసీపీ నాయకులు బుధవారం బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు బొల్లిన నిర్మలా కిషోర్ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. మండల అధ్యక్షులు కె.నాగరాజు, ఎంపీటీసీ ఎస్. అనిత కుమారి, బీజేపీ జిల్లా సభ్యత్వ ప్రముఖ్ మాలతీరాణి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షురాలు వి.కాంచనమాల, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి వరలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.


దేవీనవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవార్లు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కుక్కునూరులో సరస్వతి దేవిగా దర్శనం





భూముల సమస్యను పరిష్కరించాలి

బుట్టాయగూడెం, అక్టోబరు 9 : ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో గిరిజన నిర్వాసితులకు, స్థానిక గిరిజనులకు మధ్య నెలకొన్న భూ సమస్యను వెంటనే పరిష్కారించాలని గిరిజన సంఘం నాయకురాలు చోడెం దుర్గ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం తెల్లం మునేశ్వరావు అధ్యక్షతన జరగ్గా దుర్గా పాల్గొని మాట్లాడారు. భూములు కొనుగోలు చేసినపుడు రికార్డులు పరిశీలించకపోవడంతోపాటు సర్వే చేయకపోవడంతో సమస్యలు తలెత్తాయన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో గిరిజనుల మధ్య భూ సమస్యలు తలెత్తి గొడవలు జరుగుతున్నాయని ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు స్పందించాలన్నారు. నిర్వాసితుల కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నాయకులు ఎం.గంగరాజు, బి.ముత్యాలమ్మ, పి.దుర్గారావు, టి.సాయి, కె.ధనలక్ష్మీ పాల్గొన్నారు.

కాలినడకన శబరిమలై యాత్ర

చింతలపూడి, అక్టోబరు 9 : పట్టణానికి చెందిన లోపూడి స్వామి ఆధ్వర్యంలో 14 మంది అయ్యప్ప స్వాములు బుధవారం చింత లపూడి నుంచి 1,260 కిలోమీటర్ల దూరంలో ఉన్న శబరిమలైకు కాలినడకన బయలుదేరారు. రోజుకు సుమారు 35 కిలోమీటర్లు ప్రయాణం చేస్తామని వారు తెలిపారు. ముందుగా స్థానిక వేగిలింగేశ్వరస్వామి ఆలయం, అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు చేసి యాత్ర ప్రారంభించారు. టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, టి.చంద్రశేఖరరెడ్డి, కె.శేషగిరి రావు, కుటుంబ సభ్యులు ఘనంగా సాగనంపారు.

ముగిసిన శిక్షణా తరగతులు

కామవరపుకోట, అక్టోబరు 9 : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండు రోజులుగా ఉప సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు జరుగుతున్న శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.సత్యవేణి శిక్షణ పొందిన వారికి ప్రశంసాపత్రాలు అందచేశారు. కార్యాలయ సిబ్బంది రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● లింగపాలెం : గ్రామంల్లోని సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.వాణి అన్నారు. ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు సమస్యలు, వాటిని పరిష్కరించే విధానాలపై అవగాహన కల్పించారు.

మందుగుండు సామగ్రి స్వాధీనం

లింగపాలెం, అక్టోబరు 9: ఎవరైనా పేలుడు పదార్థాలు, మందు గుండు సామగ్రి అక్రమంగా కలిగి ఉంటే చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.వెంకన్న అన్నారు. తమకు అందిన సమాచారం మేరకు కుప్పాలవారిగూడెంలో రూ.16,850ల విలువ గల మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకునట్లు ఎస్సై తెలిపారు. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో మందు గుండు సామగ్రి విక్రయించాలంటే లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.



గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బాలరాజు



జీలుగుమిల్లి, అక్టోబరు 9 : మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బాలరాజు చెప్పారు. వంకవారిగూడెం నుంచి బర్రింకలపాడు ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాలకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరాకు బుధవారం ఆయన బర్రింకలపాడులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. డీఈ రాధాకృష్ణ, ఏడీఈ రాజ్‌కుమార్, జేఈఈ గోలునాయక్, వెంకట్ ఉన్నారు.

పోలం పిలుస్తోందిలో రైతులకు సూచనలు

కామవరపుకోట/లింగపాలెం/కొయ్యలగూడెం/బుట్టాయగూడెం/ అక్టోబరు 9 : మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కేఎస్‌రామవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి హబీబ్ బాష ముఖ్య అతిథిగా హాజరై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో వ్యవహరించవలసిన తీరును తెలిపారు. ఏవో డాక్టర్ సి.పవన్ కుమార్‌తో పాటు పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు. లింగపాలెం మండలం కె.గోకవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏడీఏ నాగకు మార్ డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీ, ఎరువులు చల్లే విధానం గురించి రైతులకు తెలియచేశారు. రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఏవో మురళీకృష్ణ, గ్రామ స్తులు పాల్గొన్నారు. కొయ్యలగూడెం మండలంలోని కన్నాపురం, సరిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఏడీఏ బుచ్చిబాబు పాల్గొన్నారు. కన్నాపురంలో డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీని డెమోలు చూపించారు. వెటర్నరి డాక్టర్ శ్రీనివాస్, ఏవో చెన్నకేశవులు పాల్గొన్నారు. బుట్టాయగూడెం మండల వ్యవసాయాధికారి డి.ముత్యాల రావు జైనవారిగూడెం, విప్పలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పంట పొలాలను పరిశీలించి తెగుళ్ల ఆశించినట్లు గుర్తించారు. రైతు సేవా కేంద్రంలో సమావేశం నిర్వహించి రైతులతో మాట్లాడారు. సర్పంచ్ తాటి సీత, వ్యవసాయ సహాయకులు, పోలవరం మార్కెట్ సూపర్‌వైజర్, రైతులు పాల్గొన్నారు.

















